క్లుప్తంగా

సీసీ కెమెరాలు ప్రారంభం



ఊర్కొండ: మండలంలోని బొమ్మరాజుపల్లిలో దాతల సహకారంతో గ్రామంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్‌ఐ వీరబాబుతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరాల విచారణలో సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి చందాల సేకరణ



మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధి కోసం భక్తుల నుంచి శాశ్వత సభ్యత్వాలు ముమ్మరం చేశారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ ఆలయం విశిష్టతను తదితర విశేషాలను వివరిస్తూ ముందుకుసాగారు. భక్తుల నుంచి రూ. 1,116లు చందాల రూపంలో సేకరిస్తున్నారు. ఆయా కాలనీల నుంచి భక్తులతో పాటు ఇతర ప్రాంతాలలో ఉన్న భక్తులు సైతం చందాలు అందజేస్తూ ఆలయం నిర్వహణ, అభివృద్ధిలో శాశ్వత సభ్యులుగా చేరుతున్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పుల్జాల శేఖర్, సభ్యులు బాలకృష్ణ, మల్లాజీ, మల్లేష్, వినోద్, శరణ్, పిట్టల శేఖర్, సరస్వతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి ప్రతిభ

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పంచాయతీలోని సోమ్లతండాకు చెందిన కోర్ర నవీన్‌చౌహన్ మెడ్చల్ జిల్లాలో ఘన్‌పూర్‌లో మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. 2024 ఆగస్టు11న మెడికల్ పీజీ ప్రవేశ పరీక్ష రాయడంతో ఈనెల 20న వెలువడిన ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో 409 ర్యాంకు సాధించి చెన్నైలోని స్టాన్లీ మెడికల్ కళాశాలలో ఎండీ పీడియాట్రిక్‌లో సీటు సాధించాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు నవీన్ చౌహన్‌ను అభినందించారు.

జానపద, నృత్య పోటీల్లో రెండోస్థానం

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 21న ఎస్‌సీఈఆర్‌టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జానపద, నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చారు. పర్యావరణ పరిరక్షణ విభాగంలో విద్యార్థులు శ్రీవాణి, స్వప్న, వసుంధర, స్వాతి, గీత, లౌకిక ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. శుక్రవారం ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు. గైడ్ ఉపాధ్యాయుడు చాంద్‌పాషా, సీనియర్ ఉపాధ్యాయులు మురళీ, మనోహరాచార్యులు, కరుణశ్రీ, శ్రీనివాసులు, మల్లేష్‌గౌడ్, భాస్కర్, రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులను విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విధుల నుంచి తొలగించకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటమ్మ, నాగమ్మ, మణెమ్మ, గౌసియాబేగం, బాలపీర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

కొల్లాపూర్: తమిళనాడులో న్యాయవాది దారుణహత్యకు నిరసనగా కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. దాడులకు, హత్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, ఉపేందర్, నిరంజన్, నజీరోద్దీన్, మోహన్‌లాల్, కురుమూర్తి, రామలక్ష్మమ్మ ఉన్నారు.

కేఎల్‌ఐ కాల్వల్లో జమ్ము

● పట్టించుకోని అధికారులు



సాతాపూర్ వద్ద కేఎల్‌ఐ కాల్వలో ఉన్న జమ్ము

పెద్దకొత్తపల్లి: రైతులకు సాగునీరు అందించే కేఎల్‌ఐ కాల్వల్లో జమ్మును తొలగించకపోవడంతో రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఏళ్ల తరబడి కాల్వలో ఉన్న జమ్మును తొలగించకపోవడంతో సాగునీరు రావడానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో రైతులు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి జొన్నలబొగుడ, సాతాపూర్, నారాయణపల్లి, గంట్రావ్‌పల్లి, కల్వకోల్, కుడికిల్ల, ఎల్లూరు గ్రామాలకు సాగునీరు అందించే కాల్వల్లో జమ్ము తొలగించలేదు. కేఎల్‌ఐ ప్రాజెక్టులలో నీరు అయిపోయిన తర్వాత వేసవి కాలంలో కాల్వలో ఉన్న జమ్మును తొలగించేందుకు అయా గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా కూలీలతో జమ్మును తొలగించారు. జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి వెళ్లే కాల్వలో జమ్ము తొలగించకపోవడంతో రైతులకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలో మిషన్ల ద్వారా జమ్మును తొలగించాలని సాతాపూర్ రైతులు వెంకటస్వామి, రాములు కోరారు.

విద్యుత్ తీగలు తొలగించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తాడూరు: మండలంలోని అంతారంలో ఇళ్ల మధ్యన ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు మార్చాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ గ్రామంలోని బీసీ వాడలో 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవతున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజు, వెంకటయ్య, బాలస్వామి, రమేష్‌లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల ఇళ్లను క్రమబద్ధీకరించి ఇంటి నంబర్లు కేటాయించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకున్న యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఇంటి నంబర్లు కేటాయించి కాలనీలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, గుంపల్లి అశోక్, రమేష్, కాశన్న, మధు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న నాయకులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని గోవర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాలలో శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమైక్య సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమసమాజం కోసం పోరాడాలన్నారు. సంఘంలో ప్రతి ఒక్కరు సభ్యులుగా చేరాలని విద్యార్థులను కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది విద్యార్థుల జీవితాలకు మేలు జరుగుతుందన్నారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, తెలకపల్లిలో మహిళ, బాలుర వసతి గృహాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బేషమోని ఆంజనేయులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గాయిత్రి, పావని, శ్రావన్, నితిన్, కుమార్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

చారకొండ: ఇటీవల నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో రైతువేదికలో శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులకు, ఉపాధి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు సర్వే పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సర్వే వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేపట్టాలన్నారు. 55 మంది ఆపరేటర్లతో నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీఓ వెంకటేష్, ఏఎస్‌ఓ విక్రంరెడ్డి తదితరులు ఉన్నారు.

సర్వేకు ఆటంకం



మన్ననూర్: కుల, సమగ్ర సర్వే కోసం ఎన్యుమరేటర్లు వెళ్తున్న సమయంలోనే కూలీలు పత్తి తీసేందుకు వెళ్తున్నారు. దీంతో సర్వేకు ఇబ్బందులు, ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతి ఎన్యుమరేటర్ 150 నుంచి 170 కుటుంబాల వరకు సర్వే చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఎన్యురేటర్లు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆశించిన స్థాయిలో సర్వే ముందుకు సాగడం లేదు. ఎన్యుమరేటర్లు రాత్రివేళలో కూడా సర్వే చేయాల్సి వస్తుందని ఎన్యుమరేటర్లు పేర్కొన్నారు. ప్రజలు అందుబాటులో ఉండి వివరాలు తెలపాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు అంచున కంసానిపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో శుక్రవారం అక్రమంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లో నింపుతున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ నరేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన జోగు రాములమ్మ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు ఆశాదీప్‌రెడ్డి రూ.5వేలు సమకూర్చగా గ్రామానికి చెందిన నాయకులు బాలేమియా, రాములు యాదవ్‌లు బాధితకుటుంబానికి నగదు అందజేశారు. ఈరగల్ల ప్రశాంత్ అంజయ్య, రామస్వామి, నిరంజన్ గ్రామస్తులు ఉన్నారు. అదేవిధంగా మండలంలోని జేపల్లి గ్రామానికి చెందిన వంకేశ్వరం అలివేలు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. శుక్రవారం దోస్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

జేఎల్, గ్రూప్‌-4 ఫలితాల్లో ప్రతిభ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సింధుశ్రీ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గ్రూప్‌-1, గురుకుల టీజీటీ, గ్రూప్‌-4, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు పరీక్షలు రాసింది. టీజీటీ ఉద్యోగం సాధించి అచ్చంపేట దగ్గరలోని వెల్టూర్‌లో టీజీటీ ఇంగ్లీష్ ఉద్యోగం సాధించి అక్కడ పనిచేస్తుంది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్‌-4లోనూ ఉద్యోగం సాధించి, రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. గురువారం రాత్రి విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాలలో సైతం ఇంగ్లీష్ లెక్చరర్‌గా ఎంపికై ంది. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించటంపై కుటుంబసభ్యులు, స్థానికులు సింధుశ్రీని పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సత్యసాయి మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. సత్యసాయి జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

కొల్లాపూర్: పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం మహాపడిపూజ నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మెట్ల పూజ చేసి, స్వామి వారిని అభిషేకం చేశారు. ఆలయంలో స్వాములకు మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములు భజన, కీర్తనలు ఆకట్టుకున్నాయి.

ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు



అమ్రాబాద్: మండలంలోని బీకే లక్ష్మాపూర్‌లో శుక్రవారం పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులలో గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు నిర్వహించారు. 35 పశువులకు చికిత్సలు నిర్వహించగా మరో 25 దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అనిల్, రాజు, పల్లవి, పారా వెటర్నరి సిబ్బంది జానకిరాం, జనార్దన్, వెంకటేశ్వర్లు, గోపాల్ మిత్ర సూపర్‌వైజర్ మురళీధర్, దశరథం, జనార్దన్, నాసరయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిదశ కీలకం

మన్ననూర్: విద్యార్థి దశ ఎంతో కీలకమని ప్రధానోపాధ్యాయుడు సిద్దార్థ మహదేవ్ పేర్కొన్నారు. శుక్రవారం అమ్రాబాద్ క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు మన్ననూర్‌లోని గిరిజన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పది విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో సాధించాలన్నారు. భవిష్యత్తుకు మంచి పునాదులు ఇక్కడి నుంచే ఏర్పడుతాయన్నారు. వచ్చే 2024-25 వార్షిక పరీక్షలలో 10/10 లో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరికి రూ. 1000 నగదు బహుమతితో పాటు మెడల్ బహుకరిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, శ్యాంసుందర్, సురేందర్, కృష్ణ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో చేపపిల్లలు విడుదల



కొల్లాపూర్: పాలమూరు ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్‌లో కుడికిళ్ల, మొలచింతలపల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపపిల్లలు వదిలారు. శుక్రవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఉరి సుధాకర్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మత్స్యకారుల జీవనోపాధికి పెంపుకు అవకాశాలు కల్పించాలన్నారు. నాయకులు నక్క బిచ్చన్న, పిట్టల సుధాకర్, చెన్నయ్య, రాజు, వెంకటయ్య, బాలకృష్ణ, సూరి, అంజి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శంషుద్దీన్

చారకొండ: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు నష్టపోతున్నారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శంషుద్దీన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో శుక్రవారం ఎస్‌ఐ శంషుద్దీన్ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటీపీ, బ్యాంక్ ఖాతా, ఆధర్, పాన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. గ్రామంలో అనుమానాస్పదస్థితిలో ఎవరైన కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాతలుగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ కేశవరెడ్డి, గ్రామస్తులు పోలీసులు తదితరులు ఉన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి

కల్వకుర్తిరూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీసీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల సమస్యలపై శుక్రవారం బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సగర సంఘం నాయకులు బీసీ చైర్మన్ నిరంజన్‌ను నాగర్‌కర్నూల్ సగర సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి రాజుసాగర్‌లు కలిసి సగరులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు దుస్తులు కుట్టిస్తాం

నాగర్‌కర్నూల్‌రూరల్: సావిత్రిపూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయ్ టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో విద్యార్థులకు దుస్తులు కుట్టి ఇవ్వనున్నట్లు టైలరింగ్ నిర్వాహకులు ఉదయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు మాట్లాడి దుస్తులు కుట్టేందుకు కొలతలు తీసుకున్నారు. అటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని తల్లిదండ్రులు లేని పిల్లలకు తమ వంతు సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 30 మంది అనాథ పిల్లలకు తాము ఉచితంగా బట్టలు స్టిచింగ్ చేసి ఇస్తామన్నారు.

రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ జీకే టెస్ట్



నాగర్‌కర్నూల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ జీకే టెస్ట్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని క్లాస్‌మెట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు కోళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆన్‌లైన్ టెస్ట్‌కు సంబంధించి స్థానిక జీహెచ్‌ఎంలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డీఈఓ గోవిందరాజులు టెస్ట్‌కు సంబంధించి పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను, చంద్రప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి చిరంజీవులు, వెంకటరమణ, కోశాధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి



కోడేరు: కులగణనలో ఉపాధ్యాయులు పనిభారం తగ్గించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేలో ఉపాధ్యాయులపై పనిభారం మోపి సకాలంలో పూర్తి కావడం లేదని ఒత్తిడి చేయడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం పని భారం తగ్గించాలన్నారు. అనంతరం రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, ప్రభాకర్, చంద్రకళ, మల్లికార్జున్ రెడ్డి, శివ, మహేష్, శ్రీశైలం, జక్కయ్య, శ్రీలత, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన బాలుడు దండు లక్ష్మణ్ కొన్ని రోజుల కిందట పిడుగుపాటుతో మృతిచెందిన విషయం విధితమే. ప్రభుత్వం నుంచి రూ.6 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిలు బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, లక్ష్మణ్, ఎండీ ఫరీద్, బాలస్వామి, ఎండీ జిలానీ, బాబా పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గుండూరుకు చెందిన రేణు సహకారంతో శుక్రవారం టై బెల్టులు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్ అందజేశారు. కార్యక్రమంలో తోటపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి, హెచ్‌ఎం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక ప్రచారం

కల్వకుర్తి: నియోజకవర్గ పరిధిలోని 271 పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం, శనివారం ఓటరుజాబితాపై ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, 01.01.2025 నాటికి 18 ఏళ్లు నిండిన నూతన ఓటర్లు ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చని, ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు.

నాసిరకం చేప పిల్లల పంపిణీపై ఆగ్రహం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు సాతాపూర్ గ్రామాలకు మత్స్యశాఖ చేపపిల్లలను సరఫరా చేశారు. అందులో కొన్ని చనిపోయిన చేపపిల్లలతో పాటు మరికొన్ని సన్నగా బలహీనంగా ఉండటంతో మత్స్యకారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సాతాపూర్ గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో చేప పిల్లలను వెనక్కి పంపించారు. నాణ్యమైన చేపపిల్లలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రామస్వామి, మల్లేష్, రాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం ఆర్‌ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, భాస్కర్‌లు మాట్లాడుతూ ఈ నెల 23 ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా శాంతిసాంకేతిక విప్లవం, ప్రజల జీవనోపాధిని ఎలా ప్రభావితం చేస్తుందనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కల్వకుర్తి లయన్స్ క్లబ్ దగ్గర రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు గాయాలు

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ బైక్‌పై పనినిమిత్తం వెళ్తున్నాడు. దర్గా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బాల్‌రాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ ఇంట్లో కొల్లాపూర్‌కు చెందిన యువతి కొన్నేళ్లుగా పనిమనిషిగా పనిచేస్తుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో బయట నుంచి తెచ్చుకున్న యాసిడ్‌ను తాగింది. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు.

మద్యం పారబోసిన ఎక్సైజ్ అధికారులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని మద్యం డిపోలో రూ.4 లక్షల విలువ గల మద్యాన్ని శుక్రవారం ఎక్సైజ్ అధికారులు పారబోశారు. ఓ కంపెనీకి చెందిన మద్యాన్ని నాలుగేళ్లుగా మద్యం గోదాంలోనే భద్ర పరిచారు. సదరు కంపెనీ యాజమాన్యం మద్యం విక్రయించకపోవడంతో కంపెనీ విజ్ఞప్తి మేరకు 552 కాటన్ల మద్యం పారబోసినట్లు సీఐ విప్లవరెడ్డి తెలిపారు.

ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18న మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన శివశంకర్ డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డాడు. శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి రాములు నిందితుడికి 15 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధించారు. అదేవిధంగా శ్రీపురం గ్రామానికి చెందిన విష్ణుకు రూ. 500 జరిమానాతో పాటు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వల్పగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: బస్సు డ్రైవర్ వేగంగా బస్సు నడపడంతో పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెళ్తూ నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూరు గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో బస్సులో ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన ప్రయాణికులను జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.